మెజీషియన్ అసోసియేషన్ లోగో ఆవిష్కరణ

యువ తెలంగాణ మెజీషియన్ అసోసియేషన్ లోగోను ఆవిష్కరిస్తున్న మల్లం రమేశ్ తదితరులు

చిక్కడపల్లి, ఏప్రిల్ 19 : ఇంద్రజాల కల ప్రజల్లో ప్రత్యేకతను సంతరించుకుందని వందే భారత్ సినీ నిర్మాత, దర్శకుడు మల్లం రమేశ్ అన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో యువ తెలంగాణ మెజీషియన్ అసోసియేషన్ ప్రారంభోత్సవం జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీ రంగ ప్రవీణ్, గుమ్మడివెల్లి శ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మల్లం రమేశ్, కేంద్ర సాహితీ అకాడమీ అవార్డు గ్రహీత చొక్కపు వెంకటరమణ, సినీనటుడు మెజీషియన్ జే ప్రదీప్‌రంగ్రేజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ లోగోను ఆవిష్కరించారు.

విద్యార్థి అదృశ్యం

ఆదిత్య

అంబర్‌పేట, ఏప్రిల్ 19: కోచింగ్ సెంటర్ వద్ద నుంచి ఓ విద్యార్థి అదృశ్యమైన ఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై జి. శ్రీనివాసరావు తెలిపిన ప్రకారం.. ఎల్బీనగర్, సాగర్ రింగ్‌రోడ్డు, యశోదనగర్‌లో ఉండే గుజాల వెంకటేశ్ తన కొడుకు ఆదిత్య(19), కూతురు అమూల్యను నల్లకుంటలోని రామబ్రహ్మ ఐఐటీ కోచింగ్ సెంటర్ వద్ద శుక్రవారం వదిలాడు. కూతురు అమూల్య క్లాస్‌రూమ్‌లోకి వెళ్లింది. కానీ ఆదిత్య మాత్రం కోచింగ్‌కు వెళ్లకుండా తనకు చదువు చెప్పే మేడంకు ఈ రోజు క్లాస్‌కు రావడం లేదని మేసేజ్ పంపించాడు. ఇది తెలుసుకున్న ఆదిత్య సోదరి అమూల్య వెంటనే తన తండ్రికి చెప్పింది. దీంతో వెంకటేశ్ కోచింగ్ సెంటర్ వద్దకు వచ్చి తన కుమారుడికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

స్నేహితుడి పెండ్లికి వెళ్లిన వ్యక్తి అదృశ్యం

జె. అనిల్

కవాడిగూడ, ఏప్రిల్ 19: స్నేహితుడి పెండ్లికి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన దోమలగూడ పరిధిలో శుక్రవారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. వరంగల్ జిల్లా అమీన్‌తండాకు చెందిన జే అనిల్(25) రాపిడో డ్రైవర్‌గా పనిచేస్తూ ఓంకార్ కాలనీలో ఉంటున్నాడు. ఈ నెల 10న ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అతని రూంమెట్ బి. నవీన్ అనిల్‌కు ఫోన్ చేయగా వనస్థలిపురంలో తన స్నేహితుడి పెండ్లికి వెళ్లాను, రెండు రోజుల్లో తిరిగి వస్తాను అని చెప్పాడని, అప్పటి నుంచి నేటి వరకు రూంకు తిరిగి రాకపోవడంతో దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. నలుపు, తెలుపు టీ షర్ట్, నైట్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడని ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆచూకీ తెలిసినవారు దోమలగూడ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

బీఆర్ఎస్‌కు బీజేపీకి మధ్యనే పోటీ

- పోటీలో లేని కాంగ్రెస్
- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, ఏప్రిల్ 19 : సికింద్రాబాద్ లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు బీజేపీకి మధ్యనే పోటీ ఉందని, కాంగ్రెస్ పార్టీ అసలే పోటీలో లేదని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ గోల్నాక డివిజన్ కార్యకర్తల సమావేశం పార్టీ డివిజన్ అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్ అధ్యక్షతన స్థానిక ధ్రువ ఎలైట్‌లో జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే గత అసెంబ్లీ ఎన్నికల్లో బూత్‌ల వారీగా పోలై న ఓట్లు, మెజార్టీ ఇచ్చిన బూత్‌లను సమీక్షించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్ పోటీ చేయా లా? వద్దా? అనే సందిగ్ధంలో ఉన్నాడని, సర్వే చేయిస్తే దానం మూడోస్థానంలో ఉన్నాడని చెప్పారు. ఆయనకు ఎంపీగా పోటీ చేయాలని ఐదు శాతం కూడా లేదని, ఇటీవలే ఆరెమైసమ్మ గుడికి వెళ్లి తనను ఎంపీ అభ్యర్థి నుంచి తప్పిస్తే 101 కొబ్బెరికాయలు కొడతానని మొక్కుకున్నట్లు పేర్కొన్నారు. అంటే కాంగ్రెస్ పార్టీ పోటీలో లేనట్లేనన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే మూసీలో వేసినట్లే నని తెలిపారు. 20 ఏండ్లు ఎమ్మెల్యే, ఎంపీగా ఉన్న కిషన్‌రెడ్డి అంబర్‌పేటలో ఒక్క మైనార్టీ బస్తీలో తిరగలేదని, ఎమ్మెల్యేగా తాను అన్ని మైనార్టీ బస్తీలను అభివృద్ధి చేశానని, ముస్లింలకు రూ.2 కోట్ల విలువచేసే గ్రేవ్‌యార్డు స్థలం కేసీఆర్, కేటీఆర్‌కు చెప్పి ఇప్పించడం జరిగిందన్నారు. శ్రీరమణ థియేటర్ నుంచి అలీకేఫ్ వరకు సెంట్రల్ మీడియాను అభివృద్ధి చేశానని, మూసీ పై వంతెనను కూడా నిర్మిస్తున్నామన్నారు. అన్ని వర్గాలు, అన్ని బస్తీలను తాను అభివృద్ధి చేశానని, అందుకే అసెంబ్లీ ఎన్నికల కంటే పదిశాతం రెట్టింపు కసితో పనిచేసి బీఆర్ఎస్ అభ్యర్థి టి.పద్మారావుకు అంబర్‌పేట నుంచి అత్యధిక మెజార్టీని ఇద్దామన్నారు. పార్టీ సీనియర్ నాయకులు కత్తుల సుదర్శన్‌రావు, ఆర్కేబాబు, రెడపాక రాము, బి. లింగంగౌడ్, బుచ్చిరెడ్డి, యూసుఫ్‌దీన్, లక్ష్మన్‌గౌడ్, మధుసూదన్, రామాగౌడ్, దామోదర్, పల్లవి, ఉమ, లక్ష్మి, సహేద, మల్లేశ్‌గౌడ్, నర్సింగ్‌యాదవ్, రాజు, సురేశ్‌గౌడ్, కుందెన సత్యనారాయణ, ఖదర్ష రీఫ్, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వంట గ్యాస్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ముషీరాబాద్ అగ్నిమాపక స్టేషన్ ఇన్‌స్టేషన్ వెంకటేశ్వర్

కవాడిగూడ, ఏప్రిల్ 19: గ్యాస్ సిలిండర్ల లీకేజీతో జరిగే అగ్ని ప్రమాదాల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని ముషీరాబాద్ అగ్నిమాపక ఎస్‌హెచ్ఓ జి. వెంకటేశ్వర్ అన్నారు. వేసవిలో సంభవించే అగ్ని ప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిసి ఉండాలని అన్నారు. శుక్రవారం కవాడిగూడలోని ఇంగ్లిష్ యూనియన్ హైస్కూల్‌లో అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు గ్యాసీ లీకేజీ, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అనంతరం వారోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆయన తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి, స్కూల్ ప్రిన్సిపాల్ పి. స్వర్ణలతారెడ్డి, అగ్నిమాపక సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. సిబ్బంది ఎస్. సాజీద్ కుమార్, దస్తగిరి, వంశీ, విద్యార్థులు పాల్గొన్నారు.

అత్యధిక స్థానాల్లో ఘన విజయం సాధిస్తాం

- బీఆర్ఎస్ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్

గుఫానగర్‌లో పాదయాత్ర కార్యక్రమంలో పాల్గొన్న హైదరబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్‌యాదవ్

అబిడ్స్, ఏప్రిల్ 19 : పార్లమెంట్ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ అత్యధిక పార్లమెంట్ స్థానాలలో ఘన విజయం సాధించి అందరి నోర్లు మూయిస్తామని హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళ్‌హాట్ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్, గుఫానగర్, ఆర్‌కె పేట్, మంగళ్‌హాట్, జాలి హనుమాన్, పురానాపూల్ తదితర ప్రాంతాలలో ఆయన బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి అభివృద్ధి కోసం బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం గడ్డం శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం కొందరు రాజకీయ నాయకులు రాజకీయ పబ్బం గడపడం కోసం బీఆర్ఎస్ పార్టీపై అవాకులు, చెవాకులు మాట్లాడడం తగదన్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజల పార్టీ అని ఆ పార్టీకి ప్రజలలో నేటికి చెక్కు చెదరని ఆదరణ ఉందని, కొందరు రాజకీయ నాయకులు పార్టీ మారినంత మాత్రాన ఒరిగేదేమి లేదని పేర్కొన్నారు. ప్రతి ఎన్నికలలో నాయకులు పార్టీలు మారడం సహజమని, దానికి చింతించాల్సిన అవసరం లేదన్నారు. సీఎం కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలు తన గెలుపుకు దోహద పడ్తాయని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వారి సహకారంతో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మనోహర్ గైక్వాడ్, శ్రీనివాస్ యాదవ్, శ్రీశైలం, హెచ్ కుమార్, ఎ రవి, విష్ణుమూర్తి, నాగిరెడ్డి, రాకేశ్, బుజ్జి, బూడిద రాజేందర్, హెచ్ కుమార్, భాస్కర్, శ్రీశైలం, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం

కూచిపూడి నృత్యప్రదర్శన ఇస్తున్న శ్లోకారెడ్డి

రవీంద్రభారతి,ఏప్రిల్ 19 : దీపాంజలి కూచిపూడి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం రవీంద్రభారతిలోని ప్రధాన మందిరంలో దీపాంజలి కూచిపూడి డ్యాన్స్ అకాడమీ 30 వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీయింట్ సంస్థ చైర్మన్, పద్మశ్రీ అవార్డు గ్రహీత బీవీఆర్ మోహన్‌రెడ్డి, యాంకర్ సుమ కనకాల, సంస్థ నిర్వాహకురాలు, సంగీత నాటక అకాడమీ పూర్వ చైర్మన్ దీపికారెడ్డి విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి కుమారి శ్లోకారెడ్డి కూచిపూడి నృత్యప్రదర్శను ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. ప్రాచీన సాంప్రదాయ లలిత కళలను పరిరక్షిస్తూ దేశ విదేశాలలో మన సంస్కృతి సాంప్రదాయాలను చాటేలా కళాకారులు పేరు ప్రఖ్యాతుల తీసుకువస్తున్నారని తెలిపారు. అనంతరం దీపాంజలి కూచిపడి డ్యాన్స్ అకాడమీ నృత్యకారిణి, శ్లోకారెడ్డి కూచిపూడి నృత్యప్రదర్శన వీక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నది.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

తాగునీటి లోప్రెషర్ సమస్యను పరిష్కరించాలని జైస్వాల్‌గార్డెన్ రెసిడెంట్స్ వెల్ఫే అసోసియేషన్ అధ్యక్షుడు చింతల శ్రీనివాస్‌ముదిరాజ్ వాటర్‌వర్క్స్ అధికారులను కోరారు. ఈ మేరకు గోల్నాక సెక్షన్ మేనేజర్ రోహిత్‌కుమార్‌తో కలిసి శుక్రవారం కాలనీలో పర్యటించి లోప్రెషర్ సమస్యను పరిశీలించారు. కాలనీ చివరి వీధిలో కొన్ని రోజులుగా తాగునీరు లోప్రెషర్‌తో వస్తుందని చెప్పా రు. దీనికి స్పందించిన మేనేజర్ చర్యలు తీసుకుంటానని చెప్పారు. కాలనీవాసులు ప్రవీణ్‌కుమార్, లక్ష్మణ్, శ్రీనివాస్, వీణా, మంగ పాల్గొన్నారు. – అంబర్‌పేట, ఏప్రిల్ 19

కిషన్‌రెడ్డి ముషీరాబాద్‌కు చేసిందేమీ లేదు

సమావేశంలో మాట్లాడుతున్న వై. శ్రీనివాస్‌రావు

కవాడిగూడ, ఏప్రిల్ 19 : ఐదేండ్లు కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి ముషీరాబాద్ నియోజక వర్గానికి చేసిందేమీ లేదని బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై. శ్రీనివాస్‌రావు అన్నారు. పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రగతి నివేదిక పేరిట ముందుకు వస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన భోలక్‌పూర్‌లో నిర్వహించిన సమాశేశంలో పాల్గొని మాట్లాడుతూ.. భోలక్‌పూర్‌లో అధికంగా పేదలు ఉన్నప్పటికీ ఎలాంటి సంక్షేమ కార్యక్రమాలను అందించలేదని ఆయన ఆరోపించారు. కనీసం పేదలకు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను కూడా అందించలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ బీసీ సెల్ అధ్యక్షుడు ఉమాకాంత్ ముదిరాజ్, నాయకులు రహీం, మహ్మద్‌అలీ, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

హర్యానా గవర్నర్‌ను కలిసిన స్వామి చైతన్యానంద

రాజ్‌భవన్‌లో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయను స్వామి చైతన్యానంద మహారాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. భాగ్యనగర్ శ్రీరామనవమి ఉత్సవ సమితి అధ్యక్షుడు డాక్టర్ భగవంత్‌రావు, ప్రధాన కార్యదర్శి గోవింద్‌రాఠి, మాజీ కార్పొరేటర్ మెట్టు వైకుంఠం, బీజేపీ సీనియర్ నాయకులు బి. నరసింహలతో పాటు స్వామీజీ గవర్నర్ బండారు దత్తాత్రేయను కలిశారు. – అబిడ్స్, ఏప్రిల్ 19

బీఆర్ఎస్ ఎన్నికల ప్రచార రథాలు ప్రారంభం

సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి టి.పద్మారావుకు సంబంధించిన ప్రచార రథాలను శుక్రవారం నాంపల్లి నియోజకవర్గంలో ఇన్‌చార్జి సీహెచ్. ఆనంద్‌కుమార్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికలలో సికింద్రాబాద్ నుంచి పద్మారావు ఘన విజయం సాధించడం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. – మెహిదీపట్నం ఏప్రిల్ 19

లోక్‌సభ అభ్యర్థిగా అసదుద్దీన్ ఒవైసీ నామినేషన్ దాఖలు

హైదరాబాద్ లోక్‌సభ అభ్యర్థిగా మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ముందుగా చార్మినార్ మక్కా మసీదులో మధ్యా హ్నం ఒంటి గంటకు ప్రార్థనలు చేశారు. ఆ తరువాత ఆయన సోదరుడు చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీతో కలిసి వేలాది మంది కార్యకర్తల నడుమ హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయంలో అసదుద్దీన్ నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. – చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 19

టోలిచౌకిలో ఎంఐఎం ప్రచారం..

ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ అభివృద్ధిని అందిస్తున్నామని కార్వాన్ నియోజకవర్గం ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ అన్నారు. శుక్రవారం సాయంత్రం టోలిచౌకి, నానల్‌నగర్ డివిజన్‌లలో హైద్రాబాద్ భ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ తరపున ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్,కార్పొరేటర్ ఎండీ నసీరుద్దీన్ బస్తీలలో ప్రచారం నిర్వహించారు. – మెహిదీపట్నం ఏప్రిల్ 19

మధుజ్యోతికి ఉగాది పురస్కారం

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 19: ద్రవిడ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కొలకలూరి మధుజ్యోతికి ఉగాది పురస్కారం వరించింది. త్యాగరాయ గాన సభలో జరిగిన కార్యక్రమంలో మాజీ న్యాయమూర్తి జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు, శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ మాజీ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కొలకలూరి ఇనాక్, తెలంగాణ టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాసగుప్త, సంఘ సేవకుడు పబ్బ వైకుంఠం చేతుల మీదుగా ఆమె ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఆమెను అభినందించారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి జైలు శిక్ష

విల్సన్

అంబర్‌పేట, ఏప్రిల్ 19 : బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి కోర్టు 4 నెలల కఠిన కారాగార శిక్ష విధించింది. కాచిగూడ ఎస్సై నరేశ్ తెలిపిన ప్రకారం.. బోడుప్పల్‌కు చెందిన విల్సన్(40)కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. బర్కత్‌పురలోని ఓ అపార్ట్‌మెంట్‌లో 2023లో బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. అతనిపై కాచిగూడలో కేసు నమోదైంది. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం నాలుగో ఏసీఎంఎం కోర్టు అతనికి 4 నెలల కఠిన కారాగార శిక్ష విధించింది.

సన్మానం..

రంజాన్, శ్రీరామనవమి పండుగలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకున్న కాచిగూడ ఇన్‌స్పెక్టర్ లక్ష్మారెడ్డి, ఎస్సై నరేశ్‌లను పలువురు నాయకులు శుక్రవారం సన్మానించారు. మాజీ ఏజీపీ హోమ్ డిపార్ట్‌మెంట్ అబ్దుల్ కబీర్, సయీద్, యూసుఫ్, అక్బర్, సోహెల్ తదితరులు వీరిని శాలువాతో సత్కరించారు. – కాచిగూడ, ఏప్రిల్ 19

నార్త్‌జోన్‌లో రూ.52 లక్షలు పట్టివేత

సిటీబ్యూరో, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ): గత నెల 16 నుంచి ఈ నెల 16 వరకు నిర్వహించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ నార్త్‌జోన్ పరిధిలో రూ.52,43,040 నగదును సీజ్ చేసినట్లు డీసీపీ రోహిణి ప్రియదర్శిని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. నగదుతో పాటు 204.25 లీటర్ల మద్యం, 843 గ్రాము ల బంగారు, వెండి, ప్లాటీనం ఆభరణాలు, 89.323 కిలోల గంజాయి, 900 కిలోల పీడీఎస్ రైస్‌ను సీజ్ చేశామన్నారు. విలువ రూ.1, 15,55,888 ఉంటుందని దీంతో పాటు 102 బైండోవర్ కేసుల్లో 331 మందిని బైండోవర్ చేసినట్లు వెల్లడించారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

చిక్కడపల్లిలో సీఐ సీతయ్య ఆధ్వర్యంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

చిక్కడపల్లి, ఏప్రిల్ 19 : త్వరలో జరుగన్నున్న ఎన్నికల సందర్భంగా శాంతి భద్రతల సమస్య రాకుండా ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకొనేందుకు పోలీసులు, కేంద్ర బలగాలు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య నేతృత్వంలో గొల్కొండ చౌరస్తా, రిసాల, నాగమయ్య కుంట, అజామాబాద్, అచ్చయ్యనగర్, మూన్ కేఫ్, ఎస్‌వీకే, సూర్యనగర్ , చిక్కడపల్లి మెయిన్‌రోడు, వివేక్‌నగర్ హనుమాన్ టెంపుల్ పీఎస్ వరకు కొనసాగింది.

మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన కవాతులో పాల్గొన్న మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్ మహేశ్‌గౌడ్

మంగళ్‌హాట్‌లో..

అబిడ్స్, ఏప్రిల్ 19 : రాబోయే హనుమాన్ జయంతిని పురస్కరించుకుని మంగళ్‌హాట్ పోలీసులు పోలీస్ బలగాలతో కవాతు నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ మహేశ్‌గౌడ్ పర్యవేక్షణలో కవాతు కొనసాగింది. పోలీస్ స్టేషన్ నుంచి ప్రారంభమైన పోలీస్ కవాతు మంగళ్‌హాట్, మగ్రా, దిలావర్‌గంజ్, అప్పర్ ధూల్‌పేట్ తదితర ప్రాంతాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలలో భద్రతా భావాన్ని పెంపొందించేందుకు గాను ఈ పోలీస్ కవాతు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఎస్ ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రామ్‌కోఠిలో శ్రీకృష్ణుడి విగ్రహం కలకలం

కళాశాలలో బయటపడిన శ్రీ కృష్ణుడి విగ్రహం

సుల్తాన్‌బజార్, ఏప్రిల్ 19: శ్రీ కృష్ణుని విగ్రహం బయటపడిన ఘటన శుక్రవారం సుల్తాన్ బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో కలకలం రేపింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామ్‌కోఠిలోని కపాడియా నవజీవన్ ఉమెన్స్ కళాశాల రెండు సంవత్సరాలుగా మూసివేసి ఉంది. కాగా ఈ కళాశాల భవనం విషయమై కోర్టులో కేసు నడుస్తుందని స్థానికులు తెలిపారు. కాగా శుక్రవారం ఉదయం కళాశాలలో శ్రీ కృష్ణుడి విగ్రహం బయటపడిందని వార్త వైరల్ కావడంతో స్థానికులు విగ్రహాన్ని చూసేందుకు భారీగా తరలి వచ్చారు. విగ్రహానికి ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సమర్పించారు. ఇదిలా ఉండగా బయటపడిన విగ్రహం రాతిది కాదు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌ది కావడంతో స్థానిలు అనుమానం వ్యక్తం చేశారు. కొందరు కావాలనే విగ్రహాన్ని తీసుకువచ్చి మూసి ఉన్న కళాశాలలో గోతి త్రవ్వి పాతి పెట్టారని అనుమానం వ్యక్తం చేశారు. కాగా విషయం తెలుసుకున్న సుల్తాన్‌బజార్ డివిజన్ ఏసీపీ శంకర్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసాచారి సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. కళాశాల గేటు తాళం పగులగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు లోపలికి ప్రవేశించి కావాలనే శ్రీ కృష్ణుడి విగ్రహాన్ని గోతి త్రవ్వి పెట్టారన్నది కనిపిస్తుందని, భవనం విషయం కోర్టులో కేసు నడుస్తున్న నేపథ్యంలో ఇరు వర్గాలలోని ఎవరో ఒకరు ఈ పని చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. కోర్టులో ఉన్న కేసును తప్పుదోవ పట్టించేందుకే ఇలా చేసి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. విగ్రహాన్ని ఎవరు పెట్టారనే కోణంలో పోలీసులు దర్యాప్తును ప్రారంభించారు. సీసీటీవీ కెమెరాలను పరిశీలించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.

జేఎన్‌ఏఎఫ్‌ఏ యూనివర్సిటీ నూతన రిజిస్ట్రార్‌గా జి . మధుకర్

సుల్తాన్‌బజార్, ఏప్రిల్ 19 : జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా జి.మధుకర్ నియమితులయ్యారు. ఈ మేరకు కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్, అడ్మిషన్ డైరెక్టర్‌గా ఉన్న జి. మధుకర్‌ను వర్సిటీ రిజిస్ట్రార్‌గా నియమిస్తూ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ కవితా దర్యానీరావు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ప్రస్తుతం రిజిస్ట్రార్‌గా ఉన్న ప్రొఫెసర్ కొడాలి సుందర్‌కుమార్ జి. మధుకర్‌కు రిజిస్ట్రార్‌గా బాధ్యతలను అప్పగించగా శుక్రవారం మధుకర్ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

ఉత్తమ డ్రైవర్లకు సేవా పురస్కారాల ప్రదానం

ఉత్తమ డ్రైవర్లతో హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు

రవీంద్రభారతి, ఏప్రిల్ 19 : తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, మహాకవి సినారె కళాపీఠం నిర్వహణలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రోడ్డు భద్రతా వారోత్సవాలు-2024ప్రమాద రహిత ఆర్టీసీ డ్రైవర్లకు సేవా పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం శుక్రవారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. పూర్వ సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి సభా అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి. వెంకటేశ్వర్లు విచ్చేసి పలువురు ఉత్తమ డ్రైవర్లకు సేవా పురస్కారాలను ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ రీజనల్ మేనేజర్ ఖుస్రోషాఖాన్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ భీంరెడ్డి, టీఎస్‌రావు, కంటోన్మేంట్ డిపో మేనేజర్ ఎల్. రాంమోహన్, డాక్టర్ పోరెడ్డి రంగయ్య పాల్గొని 11 డిపోలకు చెందిన 11 మంది ఉత్తమ డ్రైవర్లను ఘనంగా సత్కరించారు. సంస్థ కార్యదర్శి సుమిత్ర వందన తదితరులు పాల్గొన్నారు.

బీసీ కుల సంఘాల సదస్సు..

రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య నేతృత్వంలో ఆయన నివాసంలో నిర్వహించిన బీసీ సంఘాలు, కుల సంఘాలు, ఉద్యోగ సంఘాల రాష్ట్ర సదస్సులో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర మేరు యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొల్కం శ్రీనివాస్ మేరు. ఈ కార్యక్రమంలో పలు కుల సం